

వినుకొండ : ఆటో ర్యాలీలో ఆటో నడుపుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ఆశాజనకంగా ఖరీఫ్

4.65 లక్షల ఎకరాల్లో పంటల సాగు

- పెరిగిన పత్తి, కంది, వరి సాగు
- తగ్గిన మిరప, పొగాకుపై నిషేధం
- ప్రారంభమైన రబీ



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నైరుతీలో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. కాలువలకు పుష్కలంగా నీటి సరఫరా జరుగుతోంది. క్రితం సంవత్సరం కంటే పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 4.65 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ సీజన్ ఈ నెల 1 నుంచి ప్రారంభమైంది. పత్తి.. కంది.. వరి పంటల సాగు పెరగగా మిరప సాగు తగ్గింది. ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో పొగాకు సాగును నిషేధించారు. ఇక నుంచి సాగు చేసే పంటలు రబీ సీజన్ కిందకు వస్తాయి.

పెరిగిన పత్తి, కంది సాగు విస్తీర్ణం

జిల్లాలో పంటల సాగు సాధారణ విస్తీర్ణం 5,30,927 ఎకరాలు. ఖరీఫ్‌లో 4,65,277 ఎకరాల్లో పంటల సాగు అయినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖలు వెల్లడించాయి. వరి, మిరప, పత్తి, కంది పంటలను రైతులు ప్రధానంగా సాగు చేశారు. ప్రస్తుతం పత్తి కాపు దశలో ఉంది. ఈ నెలాఖరుకు వరి సాగు పూర్తవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మిరప 1,41,000 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 70 వేల ఎకరాల్లో ఇప్పటికి సాగు చేశారు. ఇతర ఉద్యాన పంటలు ఐదు వేల ఎకరాల్లో (మిగతా 7వ పేజీలో)





పిడుగురాళ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



డ్రైవర్లకు చెక్ అందజేస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే అరవిందబాబు

ఆటోవాలాకు ఆర్థిక దన్ను

ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం

ఆటో.. ట్యాక్సీ.. మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. జిల్లా అంతటా పండుగ వాతావరణంలో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభించారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కోలాహలంగా ఎమ్మెల్యేలు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాకు రూ.15 వేలు జమ అయినట్టు మొబైళ్లకు సమాచారం అందడంతో ఆటో వాలాల మొహంలో ఆనందం వెల్లివిరిసింది. డ్రైవర్లు ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఆటోలతో భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ ప్రదర్శనల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



చిలకలూరిపేట : ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

- ఆటోవాలాల ఖాతాలకు రూ.15 వేలు జమ
- జిల్లాలో 8,884 మందికి..రూ.13.32 కోట్ల లబ్ధి
- మోదీ, చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- ఆటోలు నడుపుతూ ర్యాలీల్లో ఎమ్మెల్యేలు.. అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా జిల్లాలో 8,884 మంది ఆటో డ్రైవర్లకు రూ.13.32 కోట్ల లబ్ధి చేకూరింది. స్త్రీశక్తి పథకం సూపర్ హిట్ కావడంతో.. ఆర్టీసీ బస్సుల్లో పెద్ద ఎత్తున మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంత మేర ఆటో డ్రైవర్లకు ఆదాయం తగ్గింది. వారిని ఆర్థికంగా ఆదుకు నేందుకు ఆటో డ్రైవర్ల సేవలో పథకంను ప్రతిష్ఠాత్మకంగా కూటమి ప్రభుత్వం అమలు చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బటన్ నొక్కిన వెనువెంటనే (మిగతా 7వ పేజీలో)



మాచర్లలో ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి



సత్తెనపల్లిలో ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే కన్నా



పెదకూరపాడు : ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

జీఎస్టీపై అవగాహన అవసరం

- జీఎస్టీ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్

నాదెండ్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వివిధ వస్తువులపై తగ్గించిన జీఎస్టీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్ తెలిపారు. గణపవరంలో శనివారం కరపత్రాలు పంపిణీ చేసి, ట్రాక్టర్ ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైతులు ఎరువులు, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేసేటప్పుడు తగ్గిన ధరలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదేవి, సిబ్బంది చరణ్, సునీల్‌కుమార్, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం ప్రసాదు, రవినాయక్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీనివాసరావు, సామా శ్రీనివాస్, ఆడిటర్ మూర్తి, వెల్లంపల్లి రవిశంకర్ పాల్గొన్నారు.



జీఎస్టీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్, జాయింట్ కమిషనర్

డీఎల్‌డీవో ప్రక్షాళన

- డివిజన్ల వారీగా కార్యాలయాలు, సిబ్బంది కేటాయింపు
- పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు
- గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర దిశగా అడుగులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బాపట్ల డివిజన్ డీఎల్‌డీవో కార్యాలయం

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి):

వైసీపీ హయాంలో మొక్కుబడి తంతుగా ఏర్పాటు చేసిన విభాగాల్లో డీఎల్‌డీవో వ్యవస్థ ఒకటి. రెవెన్యూ డివిజన్‌ల వారీగా 2020లో డీఎల్‌డీవో(డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)లను అప్పటి ప్రభుత్వం కొలువుదీర్చింది. గ్రామాలను ప్రగతి బాట పట్టించడంలో అత్యంత కీలకంగా వీరు వ్యవహరించనున్నారని ప్రచార ఆర్భాటానికి తెరతీసింది. కానీ, నాలుగేళ్ల పాలనలో కనీసం వారికి సొంత కార్యాలయాలు, సిబ్బందిని నియమించడం లేకపోగా.. కనీసం వారి విధులపై కూడా స్పష్టత లేకుండా వైసీపీ ప్రభుత్వం ఒక ప్రహసనంలా మార్చేసింది. కూటమి ప్రభుత్వం సదరు వ్యవస్థ ప్రక్షాళనపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగానే పంచాయతీరాజ్ అధికారులు గడచిన మూడు నెలలుగా డీఎల్‌డీవో అధికారులకు కేటాయించాల్సిన విధులపై స్పష్టతతో పాటు, జడ్పీ కార్యాలయాలతో వీరిని అనుసంధానం చేయడంపై కసరత్తు చేశారు. డీఎల్‌డీవోలకు ప్రత్యేకంగా కార్యాలయాలు ఏర్పాటు చేసి, సిబ్బందిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

పూర్తి ప్రక్షాళన

బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని డీఎల్‌డీవో విభాగాలు సరికొత్తగా దర్శనమివ్వబోతున్నాయి. దాదాపు ప్రతి డివిజన్‌లోనూ డీఎల్‌డీవోల కోసం ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేశారు. బాపట్ల డీఎల్‌డీవో కార్యాలయం కోసం ఏజీ కళాశాల రోడ్డులోని పాత మీ-సేవ కార్యాలయ భవనాన్ని సిద్ధం చేశారు. కలెక్టరేట్‌లో నరసరావుపేట డీఎల్‌డీవో (మిగతా 7వ పేజీలో)

జిల్లాల వారీగా డివిజన్లు

బాపట్ల జిల్లాలో బాపట్ల, చీరాల, రేపల్లె, పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, నరసరావుపేట, గురజాల, గుంటూరు జిల్లాలో తెనాలి, గుంటూరు డివిజన్లకు డీఎల్‌డీవోల నియామకం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్ పరిధిలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, జడ్పీ నిధులను సమర్థంగా వినియోగించుకుని పల్లెలను అభివృద్ధి బాట పట్టించడం డీఎల్‌డీఓ విధులు. డ్వామా వంటి కీలక విభాగాలతో సమన్వయం చేసుకుని మెరుగైన ఫలితాలు చూపెట్టడం వారి విధుల్లో కీలకం. కానీ, వైసీపీ ప్రభుత్వం వారిని కేవలం అలం కారప్రాయంగా మార్చేసి.. నియామకాల ఉద్దేశాన్నే దాదాపుగా నీరుగార్చేసింది. ఒక్క డివిజన్‌లో కూడా ప్రత్యేక కార్యాలయం అన్న ఊసే లేకుండా చేసింది. ఎంపీడీవో కార్యాలయాల్లో నామమాత్రంగా డీఎల్‌డీవోలకు ఓ గది కేటాయించి.. మమ అనిపించింది.

హక్కుల్లేకుండానే.. సాగుతున్నారు!

- అగ్రహార భూముల రైతులకు ఇక్కట్లు
- క్రయవిక్రయాలకు తప్పని ఇబ్బందులు

వినుకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అగ్రహార గ్రామాల్లో పొలం రైతులకు ఉన్నా.. దానిపై హక్కు లేనట్టే. కుటుంబ అవసరాల కోసం.. పొలం విక్రయించాలంటే.. వీలు లేకుండా పోతోంది. కనీసం బ్యాంకు రుణం పొందాలన్నా.. సాధ్యం కావడం లేదు. ప్రభుత్వ సర్వే సెటిల్మెంట్ చేయకుండా అగ్రహారీకుల పేర్లతోనే రెవెన్యూ రికార్డులో భూములిచ్చారు. ప్రభుత్వాలు మారుతున్నాయి గానీ అగ్రహార భూముల పరిస్థితి మాత్రం మారడం లేదు. పాలకులు కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యను పరిష్కరించలేక పోతున్నారు. వినుకొండ నియోజకవర్గంలోని ఏడు గ్రామాల్లో 17,500 ఎకరాలు అగ్రహార భూములుండగా.. అందులో ఒక్కఎకరం కూడా క్రయ విక్రయాలకు ఆస్కారం లేదు. ఇదే తరహాలో నాదెండ్ల, రొంపిచర్ల మండలాల్లో ఈనాం భూముల సర్వే సెటిల్‌మెంట్ ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ పొలాలు ఉన్న రైతులు పంట రుణాలు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు కూడా పొందలేకపోతున్నారు. అగ్రహారికలతో సంప్రదించి భూముల సర్వే చేసి.. చట్టబద్ధంగా సాగుదారులకు హక్కులు కల్పించాల్సి ఉంది. రికార్డుల్లో వారి పేర్లు నమోదు చేయడం ద్వారా రైతులకు న్యాయం చేసినట్లు అవుతుంది. అగ్రహార భూముల వివరాలను పరిశీలిస్తే.. వినుకొండ మండలంలోని శివాపురంలో 2,011, నాగులవరంలో 662, నూజెండ్ల మండలంలోని తిమ్మాపురంలో 1,851, కొండ్రప్రోలులో 2,304, వి. అప్పాపురంలో 2,067, ఈపూరు మండలం లోని అంగలూరులో 1,270, బొల్లాపల్లి మండలంలోని గుమ్మనంపాడులో 6,500 ఎకరాలున్నాయి.

అభ్యంతరాలు ఉంటే తెలపాలి: తహసీల్దార్ సురేష్

అగ్రహార భూముల సర్వే చేపట్టే ముందు అభ్యంతరాలు రాత పూర్వకంగా స్వీకరిస్తున్నామని వినుకొండ తహసీల్దార్ సురేష్ నాయక్ తెలిపారు. వినుకొండ మండలంలోని శివాపురం, నాగులవరం గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని తెలిపారు.

వి.అప్పాపురంలోని అగ్రహారం భూములు



కాలుష్యం.. కాటేస్తోంది

సండే స్పెషల్

పొగ చూరిన గాలి.. రణగొణ ధ్వనులతో పాటు ఆహారం, నీరు, భూమి, దేహం అంతటా కాలుష్యమే. స్వచ్ఛమైన గాలి ఇటు గుంటూరు నగరం నుంచి మారుమూల పల్లె వరకు ఎక్కడా అందడంలేదు. దుమ్ము, ధూళి, దుర్వాసనతో కూడిన గాలి అంతటా నిండిపోయింది. రవాణా, గృహ నిర్మాణాలు, పరిశ్రమల కార్యకలాపాలతో అటు వాయు, ఇటు ధ్వని కాలుష్యాలు ప్రజల ప్రాణాలను తీస్తున్నాయి. కాలుష్యం కాటేస్తున్నా ప్రజలు నిర్లక్ష్యం వీడటంలేదు. ప్రమాదం ముంచుకువస్తోంది.. జాగ్రత్త అని పర్యావరణవేత్తలు, ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా.. నా ఒక్కడితో ఏమవు తోంది.. నేనొక్కడినే మారాలా.. అనే ధోరణితో ఇటు ప్రజలు, లాభార్జన యావలో వ్యాపారులు కాలుష్యాలను నానాటికీ పెంచుకుంటూ వెళ్తున్నారు. వాయు, ప్లాస్టిక్ కాలుష్యాలతో క్యాన్సర్ తదితర ప్రాణాంతక జబ్బులు ఇప్పటికే పెరిగిపోయాయి. కాలుష్యాలతో డేంజర్ జోన్‌లోకి వెళ్లిన ఢిల్లీలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులు నెలకొన్నాయని తెలిసి కూడా ప్రజలు నిర్లక్ష్యం వీడ టంలేదు. ఇప్పటికైనా కళ్లు తెరిచి కాలుష్య కారకా లను కట్టడి చేసి, పర్యావరణాన్ని సంరక్షించడంలో మనవంతుగా ఎవరికివారు కలిసికట్టుగా కృషి చేయకపోతే భావితరాలకు తీరని అన్యాయం చేసిన వారమవుతాం.

వివరాలు 7లో..

- ముంచుకు వస్తోన్న ముప్పు
- ప్రమాదం అంటున్నా ప్రజల్లో నిర్లక్ష్యం
- ఢిల్లీ పరిస్థితులను చూసి మేల్కోని జనం
- ప్రభుత్వ కృషికి ప్రజా సహకారం ఉంటేనే కట్టడి





ట్రెండ్



మా జీవితం మా హక్కు

కృత్రిమ మేధస్సు, సామాజిక మాధ్యమాలు విషపూరిత సమ్మేళనంగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు, సంస్థలు పేరు కోసం, విక్రయాల కోసం ప్రముఖుల స్వరాలు, ఆహార్యాలను అనుకరించే పోకడను అనుసరిస్తున్నారు. ఈ పోకడ నెటిజన్లను అలరిస్తున్నా, నటులను మాత్రం ఒకింత అసహనానికి గురి చేస్తోంది. కాబట్టే తాజాగా కొందరు ప్రముఖులు వారి వ్యక్తిగత హోదానూ, హుందాతనాన్నీ పరిరక్షించుకోవడం కోసం కోర్టుల ద్వారా 'పర్సనాలిటీ రైట్స్'ను పొందుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం!

ఐశ్వర్య దంపతులు సైతం

2024 మేలో, కొన్ని సంస్థలు జాకీ ష్రాఫ్ ఫొటోలను వాడుకుంటూ, అనధికారిక వస్తువుల అమ్మకాలు, వక్రీకరించిన వీడియోలతో వాణిజ్య లాభాలను ఆర్జిస్తున్నట్టు గుర్తించిన న్యాయస్థానం బాలీవుడ్ నటుడు జాకీ ష్రాఫ్ వ్యక్తిత్వ హక్కులకు కూడా రక్షణ కల్పించింది. అలాగే అనిల్ కపూర్ పేరు, ఫొటో, స్వరాలతో పాటు ఆయన సుప్రసిద్ధ క్యాచ్‌ఫ్రేజ్ 'ఝకాస్' అనే మాటను కూడా వినియోగించడానికి వీల్లేకుండా వ్యక్తిత్వ హక్కుల రక్షణను అనుమతించింది. అలాగే 2022 నవంబరులో హైకోర్టు అమితాబ్ బచ్చన్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులు ఉల్లంఘనకు లోను కాకుండా రక్షణ కల్పించింది. గత సెప్టెంబరులో ప్రపంచసుందరి, బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లతో పాటు నిర్మాత కరణ్ జోహార్‌ల వ్యక్తిత్వం, ప్రచార హక్కులకు కూడా రక్షణ కల్పించడం విశేషం. కరణ్ జోహార్ విషయంలో, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, పిన్‌ట్రెస్ట్, యూట్యూబ్‌లతో సహా వివిధ సామాజిక మాధ్యమాల వేదికల నుంచి అశ్లీల మీమ్స్, పోస్ట్‌లను తొలగించాలని కోర్టు ఆదేశించింది. అటువంటి కంటెంట్‌ను సృష్టించడం కోసం ఒక ప్రముఖుడి వ్యక్తిత్వాన్ని అనధికారికంగా ఉపయోగించడం వల్ల ఆ ప్రముఖుడి పేరు ప్రతిష్ఠలు దెబ్బతిన్నట్టు పేర్కొంది.

మధుర గాయని కూడా...



ప్రముఖ హిందీ గాయని ఆశాభోంస్లే, కృత్రిమ మేధస్సు సహాయంతో తన స్వరాన్ని దుర్వినియోగపరుస్తున్న ఎఐ కంపెనీ మింక్ ఇంక్‌తో సహా అనేక సంస్థలకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించారు. దాంతో ముందస్తు అనుమతి లేకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేదికలు, ఇ కామర్స్ సైట్‌లు, స్వతంత్ర విక్రేతలు ఆశాభోంస్లే స్వరాన్ని క్లోనింగ్ చేయడం లేదా ఆమె చిత్రాలు, పోలికలు, ఇతర వ్యక్తిత్వ లక్షణాలు దుర్వినియోగం కాకుండా బోంబే హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది. డిజిటల్ యుగంలో ప్రముఖుల హక్కులను కాపాడే క్రమంలో న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వు ప్రస్తుతం ఎంతో కీలకంగా మారింది.

నటుడు నాగార్జున కూడా...

పేరు, స్వరం, ఇమేజ్.. ఏ నటుడికైనా ఇవెంతో ముఖ్యం. వీటిని ఏ కారణంగా దుర్వినియోగపరిచినా ఏ నటులూ ఉపేక్షించరు. వెంటనే కోర్టును ఆశ్రయించి, వ్యక్తిత్వ హక్కులను పొందే ప్రయత్నం చేస్తారు. నటుడు నాగార్జున ఇదే చేశారు. తాజాగా తన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పించాలంటూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి, అనుమతి పొందారు. అక్రమ వాణిజ్య ప్రయోజనాల కోసం వస్తువులను విక్రయించడం కోసం తన వ్యక్తిత్వాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టు, తన ఫొటోలను అశ్లీల ఫొటోలతో మార్ఫింగ్ చేస్తున్నట్టు, యూట్యూబ్‌లో వీడియోలు సృష్టించడం ద్వారా, కృత్రిమ మేధస్సు సహాయంతో తనను ఉగ్రవాద సంస్థలతో, జూదంతో అనుసంధానిస్తున్నట్టు నాగార్జున తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఒక ప్రముఖ వ్యక్తి ఇమేజ్‌ను తప్పుదారి పట్టిస్తూ, అనుచితమైన, అవమానకరమైన మార్గాల్లో వారి ప్రవర్తననూ, ఆహార్యాన్నీ అనుకరిస్తూ ప్రతిష్ఠకు భంగం కలిగించినప్పుడు, వాళ్ల గుడ్‌విల్ దెబ్బ తింటుందని పేర్కొంటూ, ఢిల్లీ హైకోర్టు, నటుడు అక్కినేని నాగార్జున వ్యక్తిత్వం, ప్రచార హక్కులను కాపాడుతూనే ఆయన ప్రమేయం లేకుండా, పేరునూ, ఇమేజ్‌నూ, స్వరాన్నీ వాణిజ్యపరంగా ఉపయోగించకుండా కట్టడి విధించింది.



సండే సెలబ్రిటీ



దక్షిణాది, హిందీ సినిమాల ద్వారా ప్రేక్షకులపై తనదైన ముద్ర వేసిన హీరోయిన్ రాశీ ఖన్నా, తాజాగా ఆమె నటించిన 'తెలుసు కదా' సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.

అలాగైతే పాతబడిపోతాం...

'తెలుసు కదా' టీజర్‌కు మంచి స్పందన వచ్చింది కదా... ఎలా అనిపిస్తోంది?

చాలా ఆనందంగా అనిపిస్తోంది. సినిమాను బాగా ప్రమోట్ చేస్తున్నాం. చాలా కాలం తర్వాత నేను చేస్తున్న తెలుగు సినిమా ఇది. కాబట్టి చాలా ఎక్సైటింగ్‌గా ఉంది. నాకు హైదరాబాద్‌లో ఇల్లు ఉంది. వచ్చిపోతూ ఉంటాను. ఇక్కడ షూటింగ్ జరుగుతూ ఉంటే పుట్టింటికి వచ్చినట్లు అనిపిస్తోంది.

మీరు అనర్గళంగా మంచి తెలుగు మాట్లాడుతున్నారు... ప్రాక్టీస్ చేశారా?

చాలాకాలంగా తెలుగు సినిమాలు చేస్తున్నాను కదా! తెలుగు వచ్చేసింది. నాకు తెలుగే కాదు... తమిళం, హిందీ కూడా బాగా వచ్చు. ప్రేక్షకులతో నేరుగా కనెక్ట్ కావటానికి భాష చాలా ప్రముఖమైన పాత్ర పోషిస్తుంది. అంతేకాదు... ఇది ఆయా భాషల ప్రేక్షకులకు నేను ఇచ్చే కనీస గౌరవం.

నా తల్లితండ్రులు, మా అన్నయ్య, ఇద్దరు స్నేహితులు వీరందరూ నాకు మంచి సపోర్ట్. నాకు ఏ చిన్న సమస్య వచ్చినా వాళ్లతో చెబుతా!

మీరు హిందీ ప్రాజెక్టుల్లో కూడా నటించారు కదా... బాలీవుడ్‌కు, టాలీవుడ్‌కు ఉన్న తేడా ఏమిటి?



టాలీవుడ్‌లో హీరోయిన్లకు చాలా గౌరవం లభిస్తుంది. చాలా ఆదరంగా చూస్తారు. పైగా కాల్షీట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకానే ఉంటుంది. బాలీవుడ్‌లో కానీ, తమిళ పరిశ్రమలో కానీ కాల్షీట్ పన్నెండు గంటలు ఉంటుంది. అందువల్ల ఎక్కువగా అలసిపోతాం. అంతేకాకుండా ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. తెలుగు ప్రేక్షకులకు నా పట్ల అభిమానం ఎక్కువ. నేను ఇతర భాషల్లో చేసిన సినిమాలను కూడా వారు ఆదరిస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తూ ఉంటారు.

బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటుల పట్ల వివక్ష ఉందని విమర్శలు వినిపిస్తూ ఉంటాయి...

నాకు అలాంటి ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. అంతేకాదు, ఓటీటీ వచ్చిన తరువాత భాషపరమైన సమస్యలు తొలగిపోయాయి. ఇక్కడ హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తున్నారు. అక్కడ దక్షిణాది సినిమాలు చూస్తున్నారు. ఓటీటీలు వచ్చిన తర్వాత మంచి నటులకు అన్ని భాషల్లోను అవకాశాలు లభిస్తున్నాయి.

నటనపై మీ అభిప్రాయమేమిటి?

నటనను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. నేను సినిమా రంగానికి వచ్చినప్పుడు నాకు ఏదీ తెలియదు. మనసుకు ఎలా అనిపిస్తే అలా నటించేదాన్ని. ఆ తర్వాత నటనకు కొన్ని టెక్నిక్స్ ఉంటాయని తెలిసింది. పుస్తకాలు చదవటం మొదలుపెట్టా. వీడియోలు చూసేదాన్ని. ముంబాయిలో నాటక రంగంలో పనిచేశా. ఎప్పటికప్పుడు నేర్చుకోపోతే ప్రేక్షకులకు బోర్ కొడుతుంది. మనం పాతపడిపోతాం!

ఒక నటిగా నాకు ఎప్పుడూ అభద్రతా భావం లేదు. నన్ను నేను ఎవ్వరితోను పోల్చుకోను. ప్రతి వ్యక్తికి తనదైన జర్నీ ఉంటుంది.

మీరు స్క్రిప్టులు ఎలా ఎంపిక చేసుకుంటారు?

నేను చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. నా పాత్ర ఎలా ఉందనే విషయంపైనే ఎక్కువ దృష్టి పెడతా! కొన్నిసార్లు డైరక్టర్లు వచ్చి కథలు చెబుతారు. వాళ్ల దగ్గర స్క్రిప్ట్ ఉండదు. అలాంటప్పుడు చాలా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఇతర కారణాల వల్ల కూడా ప్రాజెక్టులు ఓకే చేస్తా. కొందరు డైరక్టర్లకు మంచి దార్శనికత ఉంటుంది. అలాంటప్పుడు ఎలాంటి సమస్య ఉండదు. వారు చెప్పినట్లు చేసేస్తాను. కొందరు వచ్చి సలహాలు అడుగుతారు. నాకు తెలిసినంత చెబుతాను.

మీకు ఏ తరహా పాత్రలు చేయాలని ఉంది?

నాకు హారర్ ఫిల్మ్ చేయాలని ఉంది. ఎందుకంటే నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. మైథాలజీ, యాక్షన్ ఫిల్మ్ కూడా చేయాలని ఉంది.

నాకు ఓషో అన్నా, బ్రహ్మకుమారిల మార్గమన్నా ఇష్టం. ఆధ్యాత్మికతపై నాకు అవగాహన ఉంది. నేను ఈ పరిశ్రమలో నెగ్గుకురావటానికి అది కూడా ఒక కారణం. నేను ఏ పనిచేసినా నిబద్ధతతో చేస్తా. అయితే ఫలితాలు నా చేతిలో ఉండవనే విషయం కూడా నాకు తెలుసు.

మీరు సినిమాలూ చేశారు, వెబ్ సిరీస్‌లూ చేశారు. రెండింటి మధ్యా తేడా ఏమిటి?

కొంత తేడా ఉంది. వెబ్ సిరీస్‌లలో పాత్రల్లో అనేక కోణాలు ఉంటాయి. వాటిని చూపించటానికి ఎక్కువ సమయం ఉంటుంది. సినిమాల్లో అంత సమయం దొరకదు. అయితే నాకు సినిమాలంటేనే ఇష్టం.

నేను భవిష్యత్తు గురించి పెద్దగా ఆలోచించను. ఎందుకంటే భవిష్యత్తులో ఏం జరుగుతుందో మనకు తెలియదు. చిన్నప్పుడు నేను ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకొనేదాన్ని. అనుకోకుండా హీరోయిన్ అయ్యా. ఇలా మనం అనుకున్నవన్నీ కావు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అమ్మో ఐ బొమ్మ

ప్రపంచంలో సినిమాను ప్రేమించే ప్రేక్షకులు ఉన్నంత కాలం, పైరసీ అనే భూతం వెంటాడుతూనే ఉంటుంది. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమను వణికిస్తున్న అలాంటి పైరసీ వెబ్‌సైట్లలో 'ఐ బొమ్మ' ఒకటి. ఈ పేరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కొత్త సినిమా థియేటర్లలో విడుదలైన కొద్ది గంటల్లోనే, లేదా ఓటీటీలోకి వచ్చిన మరుక్షణమే హై - క్వాలిటీ ప్రింట్‌తో ఈ సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి వస్తోంది. అయితే ఈ ఉచిత వినోదం తెలుగు సినిమా నిర్మాతలకు రూ. వేల కోట్ల నష్టం తెస్తోంది.

పైరసీ మాఫియా

'మూవీ రూల్స్, ఐ బొమ్మ లాంటి సైట్స్ కేవలం సినిమాలను అప్‌లోడ్ చేసే వేదికలు మాత్రమే కాదు. దీని వెనుక ఒక పకడ్బందీ వ్యవస్థ ఉంది. అంతర్జాతీయ నెట్‌వర్క్ పనిచేస్తోంద'ని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. పైరసీ వల్ల తెలుగు సినీ పరిశ్రమకు వేల కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఒక్క 2024లోనే పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు రూ. 3700 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని మాజీ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.



చిన్న సినిమాల పాలిట విలన్

భారీ బడ్జెట్ చిత్రాలు, పాన్ ఇండియా చిత్రాలకు ఓటీటీ, శాటిలైట్ హక్కుల ద్వారా కొంతమేర నష్టం తగ్గినా, పైరసీ వల్ల అత్యధికంగా నష్టపోతున్నది మాత్రం చిన్న సినిమాలే. పలు సందర్భాల్లో చిన్న నిర్మాతలు, దర్శకులు వెలిబుచ్చిన ఆవేదన దీనికి అద్దం పడుతోంది. 'మా కలలను, మా పెట్టుబడినీ పైరసీ చంపేస్తోంది. మా పెట్టుబడిలో ఒక్క పైసా కూడా తిరిగి రావడం లేదు. ఇది ఇలాగే కొనసాగుతూ ఉంటే మరో సినిమా ఎలా తీయగలం' అని చిన్న నిర్మాతలు, దర్శకులు ప్రశ్నిస్తున్నారు. థియేటర్ల ద్వారా పెట్టుబడిలో కొంతైనా రాబట్టుకోవాలని చూసే చిన్న నిర్మాతల ఆశలపై ఐ బొమ్మ నీళ్లు చల్లుతోందనడంలో సందేహం లేదు. అలాగే పైరసీ అనేది థియేటర్ల ఆదాయంతో పాటు ఓటీటీ రెవెన్యూను సైతం దెబ్బతీస్తోంది. థియేటర్లలో విడుదలతో పాటు ఓటీటీల ఆదాయానికి ఐ బొమ్మ లాంటి సైట్లు గండికొడుతున్నాయి.

పోలీసులకు సవాల్

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఐ బొమ్మతో సహా 65కు పైగా పైరసీ వెబ్‌సైట్లపై దర్యాప్తును ముమ్మరం చేశారు. ఐ బొమ్మపై దృష్టి సారించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌లో భాగమైన కొందరు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. దాని నిర్వాహకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పైరసీ రాకెట్ హైదరాబాద్‌తో పాటు దుబాయ్, నెదర్లాండ్ వంటి విదేశీ ప్రాంతాల నుంచి పనిచేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పైరసీముఠా కొన్ని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, రికార్డింగ్, ఎడిటింగ్, అప్‌లోడింగ్, మానిటైజేషన్ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఛేజింగ్ గేమ్

ఐ బొమ్మ లాంటి పైరసీ సైట్లు తమ డొమైన్లను తరచూ మార్చడం, సర్వర్లు విదేశాల్లో ఉండడం వల్ల వాటిని శాశ్వతంగా మూసివేయడం పోలీసులకు, పైరసీ సెల్‌లకు పెద్ద సవాల్‌గా మారింది. ఒక డొమైన్‌ను బ్లాక్ చేస్తే కొద్ది రోజుల్లోనే అది కొత్త పేరుతో కొత్త లింక్‌తో మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంటర్నెట్ ప్రపంచంలో ఇదొక అంతుచిక్కని 'ఛేజింగ్ గేమ్'గా మారిపోయింది.

పరిష్కారం ప్రేక్షకులు చేతుల్లోనే!

పైరసీని పూర్తిగా రూపుమాపడం కష్టమే అయినా, సినీ పరిశ్రమ, ప్రభుత్వం, ప్రేక్షకులు కలసి పోరాడాల్సిన అవసరం ఉంది. అయితే ముఖ్యంగా మారాల్సింది ప్రేక్షకులే. పైరసీ లింక్‌లను ప్రోత్సహించకుండా, నాణ్యమైన వినోదం కావాలంటే థియేటర్లలో చూడడం, చట్టబద్ధమైన ఓటీటీ వేదికలను ఆదరించడం ఒక్కటే ఈ భూతం నుంచి తెలుగు సినిమాను రక్షించే మార్గం. వేల మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కష్టం, కలలకు ప్రతిరూపమైన సినిమాను పైరసీ కోరల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రూ హంటింగ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 06
వార్ 2	హిందీ చిత్రం	అక్టోబర్ 09
ది ఉమన్ ఇన్ కేబిన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 09
కురుక్షేత్ర	హిందీ సిరీస్	అక్టోబర్ 10
అమెజాన్ ప్రైమ్		
మెయింటనెన్స్ రిక్వైర్డ్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 08
జాన్ కేండీ	డాక్యూ మూవీ	అక్టోబర్ 10
జియో హాట్‌స్టార్		
మిరాయ్	తెలుగు చిత్రం	అక్టోబర్ 10
సెర్చ్: ది నైనా మర్డర్ కేస్	హిందీ సిరీస్	అక్టోబర్ 10



ఆభరణాలన్నింటిలో గాజులకు ప్రత్యేక స్థానం ఇస్తుంటారు మహిళలు. ఎన్ని నగలు పెట్టుకున్నా.. అందమైన గాజులు వేసుకోకపోతే అలంకరణ పూర్తికానట్టే! ఒకప్పుడు.. పెళ్లయిన మహిళలు చేతినిండా మట్టిగాజులు వేసుకునేవారు. యువతులు రంగురంగుల లక్క గాజులు, ప్లాస్టిక్ లేదా నైలాన్ గాజులు వేసుకునేవారు. క్రమంగా బ్లాక్ మెటల్, వైట్ మెటల్ బ్యాంగిల్స్ వచ్చేశాయి. ఇవి కాలేజీ యువతులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఇక బంగారు గాజులు ఎప్పటికీ ప్రత్యేకమే. వాటిమీద కెంపులు, పచ్చలు, వజ్రాలు, ముత్యాలు, నీలాలు పొదిగి ఎన్నో అద్భుతమైన డిజైన్లను అందుబాటులోకి తెస్తున్నారు. వీటిని కేవలం పండుగలు, వివాహాది శుభకార్యాలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు మహిళలు. రోజువారీ వేసుకోవడానికి వీలుగా మారుతున్న పోకడలకు అనుగుణంగా రకరకాల రాళ్ల గాజులు, థ్రెడ్ బ్యాంగిల్స్ అందుబాటులోకి వచ్చేశాయి. సీజెడ్, టోరమలీన్, టోపాజ్ లాంటి మామూలు రాళ్లతో డిజైన్ చేసిన గాజులను మహిళలు ఎక్కువగా ఆదరిస్తున్నారు. డ్రెస్‌కు మ్యాచ్ అయ్యేలా రంగుల దారాలు చుట్టిన గాజులు కూడా యువతులను ఆకర్షిస్తున్నాయి. కాలేజీకైనా కార్యాలయానికైనా వెళ్లేటప్పుడు చేతికి ఒక్క గాజు వేసుకుంటే చాలనుకుంటున్నారు. అంతలా మహిళల మనసు దోచుకున్న రంగురంగుల గాజులపై ఓ లుక్కేద్దామా...



రంగురంగుల గాజులతో రమ్యంగా..

దారాల గాజులు

ప్లాస్టిక్, లేదా మెటల్ బ్యాంగిల్స్‌కు రంగురంగుల పట్టుదారాలను ఒక క్రమంలో చుట్టి కొనలను గమ్‌తో అంటిస్తారు. రెండు లేదా మూడు రంగుల దారాలను అందమైన డిజైన్ ప్రకారం చుట్టి తయారుచేసిన గాజులు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటి మీద రంగురంగుల కుందనాలు, రాళ్లు, ముత్యాలు, బీడ్స్ కూడా అతికిస్తుంటారు. మువ్వలు వేలాడదీస్తుంటారు. సన్నగా, వెడల్పుగా లేదంటే లావుగా ఇలా ఏ ఆకారంలో కావాలంటే అలా ఇంట్లోనే దారాల గాజులు తయారు చేసుకోవచ్చు. గోట్స్, సైడ్ బ్యాంగిల్స్ మాదిరిగా డిజైన్ చేసుకుని చేతులకు వేసుకుంటే నలుగురిలో ప్రత్యేకంగా కనిపిస్తారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుల దారాలతో లావుపాటి గాజులు సిద్ధం చేసుకుంటే రోజువారీ వేసుకోవడానికి బాగుంటాయి.



సీజెడ్ గాజులు

వజ్రాలకు ప్రత్యామ్నాయంగా సీజెడ్స్ ఉపయోగించి తయారుచేసే రాళ్ల గాజులను యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం వివిధ రంగుల్లో సీజెడ్స్ లభ్యమవుతున్నాయి. ఒక గ్రాము బంగారం లేదా వెండి ప్లేటింగ్‌తో పలు డిజైన్లలో రంగురంగుల సీజెడ్‌లను కూర్చి గాజులు రూపొందిస్తున్నారు. సింగిల్ లైన్, మల్టిపుల్ లైన్స్, బ్రేస్‌లెట్ స్టయిల్ గాజులు అందుబాటులో ఉన్నాయి. వజ్రాలను పోలిన కటింగ్‌తో తళతళలాడే సీజెడ్ గాజులు... సంప్రదాయ దుస్తులతోపాటు మోడరన్ డ్రెస్‌ల మీద కూడా చక్కగా నప్పుతాయి.



టోరమలీన్ గాజులు

టోరమలీన్ రాళ్లు పొదిగిన గాజులు ప్రత్యేకంగా కనిపిస్తాయి. విభిన్నమైన కటింగ్ విధానం వల్ల ఈ రాళ్లు నలువైపులా కాంతులు విరజిమ్ముతుంటాయి. గులాబీ, ఎరుపు, ఆకుపచ్చ, నీలం, నలుపు, గోధుమ రంగుల్లో లభించే టోరమలీన్ రాళ్ల గాజులను మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. పట్టుచీరలు లేదా భారీ ఎంబ్రాయిడరీ వర్క్‌లతో నిండిన లెహంగాల మీద ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. రోజువారీ వేసుకోవడానికి కూడా సౌకర్యవంతంగా ఉంటాయి.



టోపాజ్ గాజులు

రంగురంగుల టోపాజ్ రాళ్లను కూర్చి రూపొందించిన గాజులు కూడా మహిళలను ఆకట్టుకుంటున్నాయి. లక్క, ప్లాస్టిక్, మెటల్ గాజుల మీద పలు ఆకారాల్లో ఉన్న టోపాజ్ రాళ్లను అతికిస్తారు. నీలం, గులాబీ, ఆకుపచ్చ, పసుపు రంగుల్లో చిన్న, పెద్ద సైజుల్లో ఉన్న టోపాజ్ రాళ్లతో చాలా రిచ్‌గా కనిపిస్తాయి ఈ గాజులు. వెడల్పుగా గోట్ మాదిరి కనిపించే ఈ గాజులను చేతికి ఒక్కటి వేసుకున్నా గ్రాండ్‌గా ఉంటుంది.

ఉపాధ్యాయ శిక్షణ తరగతులను పరిశీలించిన జేడీ



శిక్షణ తరగతుల్ని పరిశీలిస్తున్న జేడీ శైలజ

గుంటూరు(విద్య),అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో జరుగుతున్న పీజీటీ, టీజీటీల శిక్షణ తరగతుల్ని పాఠశాల విద్యాశాఖ జేడీ, రాష్ట్ర పరిశీలకులు పి.శైలజ శనివారం పరిశీలించారు. శిక్షణా తరగతుల్ని సద్వినియోగం చేసుకోవాలని నూతన ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాల అంటే తల్లిదండ్రులకు నమ్మకం కలిగే విధంగా కృషి చేయాలన్నారు. ఏడీ బీవీ రమణ, సెంటర్ ఇన్‌చార్జి, ఎంఈఓ ఎండి ఖాసిం, పి.సుధారాణి, ప్రధానోపాధ్యాయులు ఆర్.గోవిందరాజులు, వి.వెంకట్రావు, ఏఎంఓ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పింఛను నగదు కోసం.. మామను చంపిన అల్లుడు

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న మేనమామను అల్లుడు కొట్టడంతో మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. సీఐ వీరాంజనేయులు వివరాల ప్రకారం... భట్టిప్రోలు అద్దేపల్లికి చెందిన కారుమూరి రాంబాబు (74) దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు రోజుల క్రితం తెనాలిలోని వైద్యశాలకు తీసుకు వెళ్లగా వివిధ పరీక్షలు చేయించుకు రావాలని వైద్యులు సూచించారు. అయితే పరీక్షలు చేయించుకునేందుకు తగిన నగదు లేకపోవడంతో మందులు వరకు తీసుకుని తిరిగి ఇంటికి వచ్చాడు. అతని చిన్నల్లుడు (మేనల్లుడు)లోయ ఏసుబాబు మద్యానికి బానిసై.. మేనమామ వద్ద ఉన్న పింఛన్ సొమ్ము కోసం గొడవ పడుతూ ఉన్నాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున అనారోగ్యంతో ఉన్న మేనమామను కొట్టడంతో అతను మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. భార్య సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

కాలుష్యం.. కాటేస్తోంది

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలుష్యం కంటికి కనబడదు. కానీ పెనుభూతంలా మారి మనల్నే మింగేస్తుంది. కళ్లెదుట ఢిల్లీ ఓ ప్రత్యక్ష ఉదాహరణ. రాత్రికిరాత్రే ఢిల్లీ కాలుష్యం కోరల్లో చిక్కుకోలేదు. సరైన చర్యలు లేకపోవడం.. ప్రజల్లో నిర్లక్ష్యం.. వంటి కారణా లతో ఢిల్లీవాసులు ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నారు. ఢిల్లీ అంతటి పరిణామాలు ప్రస్తుతం జిల్లాలో కనిపించకపోయినా భవిష్య త్తులో ముప్పు ముంచుకువస్తోందని తెలుస్తోంది. గాలి కాలుష్యంతో పాటు ప్లాస్టిక్, ఈ-వ్యర్థాలు ఇటు మానవుల ఆరోగ్యం, అటు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతు న్నాయి. ప్రస్తుతం పెరిగిపోతున్న క్యాన్సర్ తదితర జబ్బులే ఇందుకు ఉదాహరణగా కనిపిస్తున్నాయి. ఇష్టం వచ్చినట్లుగా వినియోగిస్తున్న ప్లాస్టిక్‌తో కాలుష్యం నానాటికీ పెరిగిపో తోంది. ప్లాస్టిక్ గాలిలో, నీటిలో, ఆహారంలో కలిసి ప్రాణాలను తీస్తోంది. అయినా ప్రజలు నిర్లక్ష్యం వీడటం లేదు. ప్రస్తుతం జిల్లాలో ఏడాదికి 7 శాతానికి పైగా ఈ-చె త్త వస్తుందని గణాంకాలు చెబుతున్నాయి. ఇది 16-20 శాతానికి పెరిగితే ఈ-స్క్రాబ్ ఎమర్జెన్సీ ప్రకటించే అవకా శం ఉంటుంది. కాబట్టి దీనిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలుష్యం కట్టడికి ప్రభుత్వ యంత్రాంగం కృషితో పాటు, అదేస్థాయిలో ప్రజలు సహక రించాలి. లేకపోతే స్వచ్ఛత, కాలుష్యం వంటి విషయాల్లో పరిష్కారం దొరకదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఈ- చెత్తతో.. ఎండలు మండే

ఎలక్ట్రానిక్ పరికరాల విని యోగం నానాటికీ పెరిగిపోతోంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో ఇళ్లలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎలక్ట్రానిక్ పరికరాలను ఇష్టారీతిన వినియోగిస్తున్నారు. చెడిపోయిన తర్వాత వాటిని చెత్తలో వేస్తున్నారు. దీంతో ఈ-చెత్త(ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలు) పెనుముప్పుగా మారుతోంది. ఇళ్లలో, రోడ్లపై, కాల్వల్లో, నదుల్లో, సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలకు మించి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఈ-చెత్తతో గతంలో కంటే ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు రెండు శాతం మేర పెరగనున్నాయని వాతావరణ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ-చెత్త వ్యర్థాలపై అవగాహన, సైక్లింగ్ పరిశ్రమల స్థాపన వంటి విషయాలపై విజయవాడ, గుంటూరు నగరాల్లో అనేక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కార్యరూపం దాల్చలేదు.

గుంటూరులో గాలి కాలుష్యం

దేశవ్యాప్తంగా అధికంగా కాలుష్యం నమోదయ్యే 132 నగరాల్లో గుంటూరు కూడా ఒకటి. పరిశ్రమలు, గృహ, శబ్ద కాలుష్యాలు పెద్దగా లేకపోయినా వాయు కాలుష్యం వల్లే ఈ జాబితాలో గుంటూరు చేరింది. కాలం చెల్లిన వాహనాలతో నగరానికి ఈ పరిస్థితి వచ్చిందని కేంద్ర కాలుష్య నియంత్రణ సంస్థ తన నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం గుంటూరులో వాయు కాలుష్యం 65-67 మైక్రోగ్రామ్స్ క్యూబిక్ క్యూడ్(ఎమ్‌జీ క్యూక్యూ)గా మధ్య నమోదవుతుంది. 60 ఎమ్‌జీ క్యూక్యూ కంటే తక్కువగా ఉంటే సాధారణస్థితి. అయితే 2015లో గుంటూరులో వాయు కాలుష్య శాతం 63 ఎమ్‌జీ క్యూక్యూగా నమోదైనట్లు గణంకాలు చెబుతున్నాయి. అప్పట్లో దీనిపై జిల్లా ఉన్నతాధికారులు అత్యవసర సమావేశం నిర్వహించి ఎట్టి పరిస్థితిల్లో 2019 నాటికి వాయు కాలుష్య శాతాన్ని 58 ఎమ్‌జీ క్యూకి తీసుకురావాలని ఆదేశాలు జారీచేశారు. కానీ అది నేటికి కార్యరూపం దాల్చలేదు.

ఆరోగ్యంపై.. తీవ్ర ప్రభావం

- కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలతో జంతువులతో పాటు, మానవాళి ఆరోగ్యానికి పెను ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఊపిరితిత్తులతో పాటు ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుంది.
- ప్లాస్టిక్‌ను కాలిస్తే డయాక్సిన్, ఫ్యూరాన్ విషవాయువులు క్యాన్సర్‌ను కలగజేస్తాయి.
- రంగుల సంచుల తయారీలో వాడే సీసం, క్యాడ్మియం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. సీసం పిల్లల పెరుగుదల, జ్ఞాపక శక్తిని హరిస్తోంది. క్యాడ్మియం కిడ్నీలను దెబ్బతీస్తుంది.
- ప్లాస్టిక్ కవర్లు, బాక్సుల్లో వేడి ఆహార పదార్థాలను నిల్వ చేస్తే ప్రమాదకరమైన ప్లాస్టిక్ గ్రాన్యుల్ పిగ్మంట్లు ఆయా పదార్థాల్లో కలసి క్యాన్సర్‌కు దారి తీస్తాయి.
- ప్లాస్టిక్ వ్యర్థాల పునర్ వినియోగ ప్రక్రియలో వెలువడే క్లోరినేటెడ్ హైడ్రోకార్బన్లు కేంద్రనాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి.
- ఈ-చెత్త వల్ల మానవ ఎదుగుదల లోపాలు, బుద్ధిమాంద్యం, రోగనిరోధక వ్యవస్థను బలహీనం చేస్తోంది. గుండె, కిడ్నీలతో పాటు దేహంలోని కీలక అవయవాల పనితీరు దెబ్బతిస్తోంది.



పోరాట వీరులు చర్మకారులు

● లిడ్ క్యాప్ వ్యవస్థాపక దినోత్సవంలో కేంద్ర మంత్రి పెమ్మసాని



కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి దుర్గేష్, వర్ల రామయ్య, పిల్లి మాణిక్యరావును గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

గుంటూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): నిప్పుల డప్పులతో గుండెచప్పుడు వినిపించే పోరాట వీరులు చర్మకారులని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం లిడ్ క్యాప్(చర్మ పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్) వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ నుంచి శిక్షణ పొందిన 300 మందికి సర్టిఫికెట్లను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ అందజేశారు. ఈ సందర్భంగా కృత్రిమ జ్ఞానం కన్నా, ప్రకృతి జ్ఞానం మెండుగా నింపుకున్న మాదిగ సోదర సోదరీమణులందరికి వందనాలంటూ.. మంత్రి పెమ్మసాని శుభాకాంక్షలు తెలిపారు. ఛైర్మన్‌గా పిల్లి మాణిక్యరావు ఏపీ లిడ్ క్యాప్‌కు పూర్తిగా న్యాయం చేస్తూ, చర్మకారులకు అండగా నిలుస్తున్నారన్నారు. అందులో భాగంగానే 300 మందికి శిక్షణ ఇస్తూ 150 మందికి ప్లేస్మెంట్లు కూడా అందించడం అభినందనీయమన్నారు. శిక్షణ ద్వారా మంచి ఉద్యోగాల్లో చేరడం ఒకటైతే.. అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించుకొని, భారతీయ సంస్కృతిని అలవర్చుకొని మిషన్లతో పోటీ పడడం మరొకటి అన్నారు. ఇందులో ముఖ్యంగా క్వాంటిటీ కంటే క్వాలిటీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎన్ని వెరైటీలు అందుబాటులోకి తీసుకొస్తే.. అంతమంది ఆదరిస్తారన్నారు. జీవో నెంబరు 70 ద్వారా లోకల్ ప్రోడక్ట్‌లను తయారు చేసే అవకాశం కల్పిస్తున్నారన్నారు. వినియోగదారులకు ఏది కావాలో తెలుసుకొని తయారు చేయగలిగితే ప్రోడక్ట్‌కి డిమాండ్ పెరుగుతుందన్నారు. పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ పథకాలను అంది పుచ్చుకొని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, ఎండీ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ప్రసన్న వెంకటేష్ తదితరులున్నారు.

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సూర్య కుమారి
● కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



ప్రసంగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సూర్యకుమారి

గుంటూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమానికి నిబద్ధతతో కృషి చేస్తోందని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధు సంక్షేమ శాఖ సెక్రెటరీ సూర్యకుమారి పేర్కొన్నారు. శనివారం కలక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం - 2025 రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణస్వామి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యలను సాధ్యమైనంత వరకు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతేడాది వరకు రాష్ట్రంలో 50 వరకు మాత్రమే ఉన్న వృద్ధాశ్రమాలను 84కు పెంచడం జరిగిందన్నారు. మరో 13 ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించామని తెలిపారు. బృందంగా ఏర్పడిన వృద్ధులకు చిన్నపాటి కార్యక్రమాల నిర్వహణకు రుణాలు సైతం మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. ప్రతి జిల్లాలోనూ సీనియర్ సిటిజన్స్ భవనాల ఏర్పాటుకు స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ సిటిజన్ డిజిటల్ కార్డులు వాట్సాప్ ద్వారా అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఆసుపత్రిలోనూ ప్రత్యేకమైన వార్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు.

వృద్ధుల సలహాలతో సమస్యలు పరిష్కారం

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా స్థానిక సమస్యలను వయోవృద్ధుల నుంచే ఎక్కువగా తెలుసుకుంటాన్నారు. వారికున్న అనుభవంతో అన్ని సమస్యలు పూర్తిగా తెలుస్తాయన్నారు. జీవితంలో గెలిచిన వారి సందేశాన్ని పిల్లలు స్ఫూర్తిగా తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులను భాగస్వామ్యం కల్పించడం జరిగిందన్నారు. సీనియర్ సిటిజన్స్ మానసిక ఆనందం కోసం డే కేర్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల వార్డును మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది పూర్తిస్థాయిలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీసులు వయోవృద్ధుల రక్షణ బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ.. మంచి మనసు ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వృద్ధుల సంక్షేమానికి అన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ.. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జి.ప్రకాష్ రెడ్డి, డీఆర్‌వో ఎస్ఎస్‌కే ఖాజావలి, ఏడీ దుర్గాబాయి, సంక్షేమ సంఘం నాయకులు కె.రామచంద్రరావు, పరమేశ్వరరెడ్డి, వేంకటేశ్వర రావు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వృద్ధులు పాల్గొన్నారు.

ఆటోవాలాకు..ఆర్థిక దన్ను!

(5వ పేజీ తరువాయి)

ఒకేసారి ఆటోవాలల మొబైల్స్ మోగాయి. వారి ఖాతాలకు జమ అయినట్లు సమచారం వచ్చింది. ఒక్కసారిగా వారు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తూ వారి.. మొబైల్స్‌కు వచ్చిన మెస్సేజ్‌లను ప్రదర్శనల్లో చూపించారు. లబ్ధిదారుల్లో 8,092 మంది ఆటో డ్రైవర్లు, 557 మంది క్యాబ్ డ్రైవర్లు, 235 మంది మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు ఉన్నారు.

నియోజకవర్గ కేంద్రాల్లో సందడి..

- వినుకొండలో ఆటోలతో డ్రైవర్లు భారీ ప్రదర్శన జరిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఖాకీ చొక్కా ధరించి ఆటో నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఆటో డ్రైవర్లకు నగదు చెక్కు అందజేశారు. సాగర్ కాలువ నుంచి ప్రారంభమైన ప్రదర్శన మునిసిపల్ కార్యాలయం వరకు సాగింది.
- నరసరావుపేట గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి ప్రకాశ్‌నగర్‌లోని భువన చంద్ర టౌన్‌హాల్ వరకు ఆటోలతో భారీ ప్రదర్శన చేశారు. కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.
- చిలకలూరిపేటలోని చౌత్ర సెంటర్ నుంచి ఆటోలతో డ్రైవర్లు గడియార స్తంభం సెంటర్ వరకు భారీ ప్రదర్శన జరిపారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు ప్రదర్శనలో ఆటో నడుపుతూ పాల్గొన్నారు.
- పిడుగురాళ్లలో ఆటోలతో డ్రైవర్లు భారీ ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు చిత్ర పటానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, డ్రైవర్లు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆటో ర్యాలీని యరపతినేని ప్రారంభించి.. ఆటో నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు.
- సత్తెనపల్లిలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆటోలతో భారీ ర్యాలీని ప్రారం భించారు. చెక్ పోస్టు నుంచి తాలుకా సెంటర్ వరకు ప్రదర్శన సాగింది.
- మాచర్లలో ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఆటో లతో భారీ ప్రదర్శన నిర్వహించారు. మాచర్ల రింగ్ రోడ్డు నుంచి ప్రారం భమైన ప్రదర్శన మునిసిపల్ కార్యాలయం వరకు సాగింది.
- పెదకూరపాడులో ఆటోల ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ ప్రారంభించి, పాల్గొన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు నగదు చెక్కును అందజేశారు.

'డీఎల్‌డీవో' ప్రక్షాళన!

(5వ పేజీ తరువాయి)

కార్యాలయం ముస్తాబైంది. ఒక్కో కార్యాలయంలో కనీసం 8 నుంచి 12 మంది వరకు సిబ్బంది విధులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక కార్యాలయాల మరమ్మతులు, ఫర్నీచర్, మౌలిక వసతుల కల్పనకు ఉమ్మడి జిల్లా జడ్పీ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు సమాచారం. పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి ఇటీవలే ప్రభుత్వం వివిధ విభాగాల అధికారుల హోదాపై స్పష్టత ఇస్తూ గెజిట్ కూడా విడుదల చేసింది. దానిలో డీఎల్‌పీవో, ఎంపీడీవోలుగా పనిచేస్తున్న వారు పదోన్నతిపై డీఎల్‌డీవోలు అవుతారని స్పష్టం చేసింది

సమర్థవంతంగా వినియోగించుకోవడానికి...

డీఎల్‌డీవో వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్ది.. డివిజన్ స్థాయిలో జరిగే ప్రతి పనిపై వారి పర్యవేక్షణ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఫలితాల విషయంలో కూడా వారినే జవాబుదారీ చేయడం వల్ల పల్లె పనుల్లో వేగం పెంచవచ్చనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఇందు కోసమే డివిజన్ స్థాయిలో రెవెన్యూ అధికారితో సమానంగా డీఎల్‌డీవోలకు కూడా ప్రత్యేక కార్యాలయం, సిబ్బందిని సమకూర్చి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి జిల్లాలు కేంద్రంగానే...

జిల్లాల పునర్విభజన జరిగి మూడేళ్లు దాటినా జడ్పీ విభాగం మాత్రం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతోంది. ప్రభుత్వం డీఎల్‌డీవోల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలనే నిర్ణయానికి వచ్చినప్పటికీ సత్వర నిర్ణయాల విషయంలో జడ్పీ సీఈవో ఆదేశాలే అంతిమం కానున్నాయి. నిధుల కేటాయింపు విషయంలో కొత్త జిల్లాల్లోని డివిజన్లకు కొన్ని చిక్కుముళ్లు ఎదురవు తున్నాయి. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత నివ్వడం వల్ల జిల్లాల వారీగా కొత్తగా కొలువుదీరే జడ్పీల్లో డీఎల్‌డీవోల ప్రాముఖ్యం మరింతగా పెరగనుంది.

ఆశాజనకంగా ఖరీఫ్

(5వ పేజీ తరువాయి)

సాగవుతున్నాయి. అపరాలు సాధారణ సాగు విస్తీర్ణం 46,700 ఎకరాలు కాగా 66,243 ఎకరాల్లో సాగవుతోంది. అంటే 142 శాతం సాగు నమోదైంది. పత్తి సాధరణ విస్తీర్ణం 2,28,915 ఎకరాలు కాగా 2,07,843 ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది కంటే పత్తి సాగు 44,500 ఎకరాలు పెరిగింది. వరి సాధరణ సాగు విస్తీర్ణం 96,498 ఎకరాలు కాగా ఇప్పటికి 1,10,343 ఎకరాల్లో సాగు చేశారు. సాగర్ అయకట్టులో వరి సాగు ఈ నెలాఖరు వరకు కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతేడాది కంటే ఇప్పటికే 26,015 ఎకరాల్లో వరి సాగు పెరిగింది. మరో 10 వేల ఎకరాల్లో వరి సాగు పెరుగుతుందని అంచనా.

తగ్గిన మిరప సాగు..

గతేడాది మిరపకు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది 1.06 లక్షల ఎకరాల్లో మిరప సాగు కాగా ఇప్పటికి 70 వేల ఎకరాల్లో సాగైంది. పొగాకును నిషేధించడంతో 1,437 ఎకరాలకే సాగు పరిమితమైంది. నైరుతీ రుతు పవనాలు తొలి రోజుల్లో మొఖం చాటేసినా ఆగస్టు, సెప్టెంబరులో విస్తృతంగా వ్యాపించడంతో జిల్లాలో అత్యధికంగా రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం 516.9 మి.మీ కాగా 544 మి.మీలుగా నమోదైంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఎమ్మెల్యే పర్యటన విజయవంతం చేయాలి

● టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్

కారంపూడి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో ఆదివారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి నిర్వహించనున్న పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కారంపూడి పట్టణంలోని వడ్డెర కాలనీలో నూతనంగా మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి భూమిపూజ చేయనున్నట్లు చెప్పారు. మండలంలో రెండో విడత 37 గోకులం షెడ్‌లు మంజూరయ్యాయన్నారు. కూటమి నేతలు పాల్గొని విజయవంతం చేయాలని సురేష్‌యాదవ్ కోరారు.

ఎంపీడీవోగా సుగుణ

దుర్గి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దుర్గి ఎంపీడీవోగా సుగుణ శనివారం బాధ్యతలు చేపట్టారు. శ్యావల్యాపురం మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉద్యోగోన్నతిపై దుర్గికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుగుణకు ఎంపీపీ యేచూరి సునీతాసాయిశంకర్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

జీఎస్టీ ఫలాలు అందరికీ అందాలి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేటు తగ్గించడం వల్ల కలిగే ఫలాలు ప్రతి గడపకు చేరాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని మండాదిలో శనివారం నిర్వహించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఈవోపీఆర్డీ మకట్‌లాల్, టీడీపీ నేతలు పాపిరెడ్డి, వజ్రం నాయక్, అంకిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

విజయపురిసౌత్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చమ్మకుంట తండాలో రూ.5 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్ భూమిపూజ నిర్వహించారు. అనంతరం వాహనమిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం విడుదల చేసిన నగదును లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మయ్య, శంకర్‌నాయక్, దేవ్లానాయక్, రాంసింగ్ పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే రీసర్వే

● తహసీల్దార్ సరోజ

రాజుపాలెం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు పూర్తి స్థాయిలో సహకరిస్తే రీసర్వేను సకాలంలో పూర్తిచేసేలా సిబ్బంది అందుబాటులో ఉన్నారని రాజుపాలెం తహసీల్దార్ సరోజ తెలిపారు. శనివారం రాజుపాలెంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. నేటి నుంచి రాజుపాలెం గ్రామం పరిధిలో రీసర్వే ప్రారంభమవుతుందని, రైతులందరూ వారి వద్ద ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్స్, పట్టాదారు పాస్‌పుస్తకాలను రీసర్వే సిబ్బందికి చూపించి భూమి సరిహద్దులు కూడా చూపించాల్సి ఉందన్నారు. రాజుపాలెంలో రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపులను గదులు కట్టుకొని అద్దెలు తీసుకుంటున్న వారికి నోటీసులు ఇచ్చి తరువాత తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వీరయ్య, గ్రామ సర్వేయర్ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వాహన మిత్ర లబ్ధిదారుల సంబరాలు

క్రోసూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా శనివారం నుంచి ప్రారంభించిన ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద లబ్ధిపొందిన వాహనాల డ్రైవర్లతో కలిసి టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. తమ తమ ఖాతాల్లో నగదు జమ కావటంపై ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దుద్దుల యోహాన్, టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్ జాన్ తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాలో 40మందికి ఉద్యోగాలు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరామ్ ఐటీఐలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 46మంది నిరుద్యోగులు వివిధ కంపెనీల్లో ఉద్యోగం పొందినట్లు ప్రిన్సిపాల్ నంబూరు బుజ్జిబాబు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల కరస్పాండెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్ సస్పెన్షన్

క్రోసూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడ్డ దొడ్లేరు సచివాలయంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ సోడా మనోజ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా వ్యవసాయ అధికారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం మనోజ్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మనోజ్‌కుమార్ పెన్షన్లు లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించుకొని నగదు పంపిణీ చేయకుండా తన వద్దనే ఉంచుకున్నట్లు లబ్ధిదారులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఉన్నతాధికారుల విచారణ అనంతరం మనోజ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆక్రమణల తొలగింపు

పిడుగురాళ్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో జాతీయ నేతల విగ్రహాల చుట్టూ ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు శనివారం తొలగించారు. ఐలాండ్ సెంటర్ సర్కిల్‌లో ఫౌంటేన్, విద్యుద్దీపాలంకరణకు పనులు చేయాల్సి ఉన్నందున అడ్డుగా ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు.

ఘనంగా ముక్త్యాలరాజా జయంతి

విజయపురిసౌత్: శ్రీరాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్ (ముక్త్యాల రాజా) 108వ జయంతిని శనివారం కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగులు విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమం మా బాధ్యత

● సొంత ఖర్చులతో ప్రమాదబీమా
● సంక్షేమ నిధి ఏర్పాటు చేసి సాయం
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందించే చేయూతతోపాటు తనవంతుగా ఆటో డ్రైవర్లకు సంక్షేమం, క్షేమం కోసం పాటుపడతానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం వాహన మిత్ర పథకం అమలు చేసి వారి ఖాతాలో నగదు చేసిన సందర్భంగా శనివారం నియోజకవర్గ ఆటో డ్రైవర్లు పట్టణంలో నిర్వహించిన ఆటో ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ ర్యాలీ శ్రీశైలం రోడ్డులోని శ్రీపెద్ద ఆంజనేయస్వామి ఆలయం నుంచి పురపాలక సంఘ కార్యాలయం వరకు సాగింది. అనంతరం మానుకొండ కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని వాహనమిత్ర పథకం ద్వారా 1277 మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం విడుదల చేసిన రూ.1,91,55,000 నగదు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా, సంక్షేమనిధి

మాచర్ల నియోజకవర్గంలో ఎంత మంది ఆటో డ్రైవర్లు ఉంటే అంతమందికి తన సొంత ఖర్చులతో ప్రమాదబీమా రుసుం చెల్లిస్తానని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హామీనిచ్చారు. ఆటో డ్రైవర్ల కుటుంబానికి ఏదైనా కష్టం వస్తే నియోజకవర్గస్థాయిలో ఒక సహాయనిధి ఏర్పాటు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, కమిషనర్ వేణుబాబు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, టీడీపీ సీనియర్ నేతలు పంగులూరి అంజయ్య, కళ్లం రామాంజిరెడ్డి, కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, వజ్రం నాయక్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్లో శనివారం ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెలినేడి రామస్వామి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థికసాయం అందించడం వల్ల వారికి చేయూతగా ఉంటుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆటో డ్రైవర్లకు యేడాదికి రూ.15 వేల ఆర్థికసాయం సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని 1266 మంది ఆటో డ్రైవర్లకు రూ.1,89,90,000 చెక్కులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కూటమి నేతలు అందించారు. ముందుగా చెక్‌పోస్టు సెంటర్ నుంచి తాలూకా సెంటర్ వరకు ఆటో డ్రైవర్ల ర్యాలీని ఎమ్మెల్యే కన్నా ప్రారంభించారు. ఆటోను నడిపి తాలూకా సెంటర్ వరకు పాల్గొన్నారు. ఆటో డ్రైవర్లంతా కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ప్లకార్డులు చేతబూనారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు నాగోతు శౌర్యయ్య, చోటా శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, శోభారాణి, జానీబాబు, మేరిగ్రేస్, గొర్రెపాటి సుశీల, అంకాల ప్రభుదాసు, నరసింహారావు, కట్టా శంకరరావు, భవన్నారాయణ, వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, దరువూరి నాగేశ్వరరావు, పూజల వెంకటకోటయ్య, ఆళ్ల అమరేశ్వరరావు, నియోజకవర్గ కూటమి నేతలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపేందుకు సైనికుడిలా పనిచేస్తున్న చంద్రబాబు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైనికుడిలా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడు సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రాంగణంలో శనివారం ఆటో డ్రైవర్ల సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల ఖాతాలో నేరుగా కూటమి ప్రభుత్వం రూ.15 వేలు జమ చేసిందని అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాల వరకు జరిగిన ఆటోల ర్యాలీలో ఆటో డ్రైవర్ యూనిఫామ్ వేసి ఎమ్మెల్యే ప్రవీణ్ స్వయంగా ఆటో నడపడంతో ఆటో డ్రైవర్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి జరిగిన పాలాభిషేకంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు వెన్నా సాంబశివరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు నల్లపాటి రాము, ఆర్డీవో సంజీవరావు, మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, పరస తాళ్లూరు పీఏసీఎస్ చైర్పర్సన్ ఏటుకూరి రత్నకుమార్, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు, టీడీపీ నాయకులు మాదినేని సుబ్బయ్య, వట్టికూటి శివరామకృష్ణయ్య, షేక్ ముంతాజ్, జనసేన మండల అధ్యక్షుడు మల్లెల చలపతిరావు, తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, ఎంపీడీవో శివలీల నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెక్కును పంపిణీ చేశారు.

● పెదకూరపాడులో శనివారం పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రారంభించారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

● మచిలీపట్నం ఎంపీ బాలశౌరి

మాచర్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జనసేన మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి జనసేన నేతలకు సూచించారు. శనివారం పట్టణంలోని కేసీపీ గెస్ట్‌హౌస్‌లో ఆయన జనసేన నేతలతో సమావేశమై పలు సూచనలు చేశారు. స్థానిక ఎన్నికల బరిలో నిలిచేందుకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలన్నారు. అనంతరం బాలశౌరిని పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, ఉమ్మడి జిల్లా కార్యదర్శి పులి హరి, న్యాయవాది బత్తుల బాబురావు, సాంబశివరావు, గంధం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బాలశౌరిని సన్మానిస్తున్న జనసేన నేతలు

దాచేపల్లిలో ఘన స్వాగతం

దాచేపల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఎంపీ బాలశౌరికి దాచేపల్లిలో కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో బాలశౌరి సమావేశమయ్యారు. కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్, మల్లి, పాముల కిషోర్, బొమ్మిరెడ్డి నాగరాజు, నలబోతుల శ్రీను, తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌తో మంజులారెడ్డి భేటీ



మంత్రి లోకేశ్‌తో శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి

రెంటచింతల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి శుక్రవారం రాత్రి మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. రాష్ట్రంలోని 9 శిల్పారామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, రూ.65 లక్షలతో గుంటూరులో ఏర్పాటు చేయనున్న బోటింగ్ పనులను గురించి వివరించారు. అలాగే తన కుమారుడు వివేక్‌రెడ్డి వివాహం ఈనెల 26న జరగనున్న నేపథ్యంలో ఆహ్వాన పత్రికలను కూడా అందచేశారు.

వెంకయ్యచౌదరికి పరామర్శల వెల్లువ

● చలమయ్యకు డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణరాజు నివాళి

విజయపురిసౌత్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి తండ్రి చలమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం మాచర్ల మండలం బెల్లంకొండవారిపాలెంలో నిర్వహించిన చలమయ్య దశదిన కార్యక్రమానికి ఏపీ డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్‌వీ రమణ, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ముందుగా చలమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకయ్యచౌదరిని పరామర్శించారు. చలమయ్యకు నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, భాష్యం ప్రవీణ్, పులిపర్తి నాని, గంటా శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, జ్యోతుల నెహ్రూ, ధూళిపాళ్ల నరేంద్ర, దామరచర్ల జనార్దన్, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, టీడీపీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, జంగా కృష్ణమూర్తి, నన్నూరి నరసింహారెడ్డి, పనబాక లక్ష్మి, సదాశివరావు, గుంటూరు సౌత్ కోస్టల్ జోన్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కృష్ణారావు, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు, జీఎస్టీ కమిషనర్ సౌమ్య, ఐవీ వెంకటేశ్వరరావు, మాజీ డీజీపీ ఠాగూర్, ప్రిన్సిపల్ సెక్రటరీ జువాలజీ, మైన్స్ ఎక్సైజ్ ఆర్పీ మీనా, సైన్స్ సిటి సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, సాగర్ కుడి కాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, నాగార్జున సాగర్ ఫ్లయిటెక్ ఏవియేషన్ ఎండీ కెప్టెన్ మమత, యరపతినేని నిఖిల్, డాక్టర్ గాడిపర్తి అచ్చయ్య, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ బంగారయ్య తదితరులు ఉన్నారు.



వెంకయ్యచౌదరిని పరామర్శిస్తున్న డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణరాజు, ప్రజాప్రతినిధులు

24 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు శనివారం 24 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8718 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,292 క్యూసెక్కులు, 24 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 1,88,112 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,42,862 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 2,42,862 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 1,96,031 క్యూసెక్కుల నీరు

రెంటచింతల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 11 గేట్లను 3.5 మీటర్లు,1 గేట్‌ను 5.5 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 1,96,031 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, గిరిబాబులు చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 2,21,404 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.

దివ్యాంగులకు యరపతినేని ఆర్థికసాయం

మాచవరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామానికి చెందిన దివ్యాంగులైన గల్లా కరుణాకరరావు దంపతులకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. శనివారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆనందరావు, గోళ్ల గంగాధరరావు, పొలగాని శివలు కరుణాకరరావు దంపతులకు రూ.10 వేలు అందజేశారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే యరపతినేని


గురజాలటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలోని రెడ్డి బండ సెంటర్ వద్ద దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని వృద్ధులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

● అమ్మవారిని డాక్టర్ శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానంలో పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు.

పన్ను తగ్గింపు ప్రయోజనాలను ప్రజలకు చెప్పాలి

● జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ నారాయణశాస్త్రి

మాచర్లరూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0వో ద్వారా కలిగే ప్రయోజనాలను వినియోగదారులకు చెప్పాలని పిడుగురాళ్ల వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.నారాయణశాస్త్రి కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం వ్యాపారులు, అకౌంటెంట్స్ ఆడిటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకమార్లు ఉన్నతస్థాయి సమీక్షలు జరిపి ప్రజలందరికీ ఆర్థిక చేయూతను అందించేందుకు జీఎస్టీ నాలుగు పన్ను శ్లాబులను రెండు శ్లాబులకు కుదించిందన్నారు. దీని ద్వారా ప్రజలకు ఆర్థిక చేయూత లభిస్తుందని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎంపీడీవో శేషిరెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణశాస్త్రి

ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం

● ఆటో డ్రైవర్ల కుటుంబాల్లో వెలుగులు : ఎమ్మెల్యే యరపతినేని



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సూపర్‌సిక్స్ హామీల అమల్లో భాగంగా రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయడం వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబాలకు సాయమందించే విధంగా వారి సంక్షేమానికి అర్హత కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.15 వేలు వారి ఖాతాలో జమ చేస్తామన్నారు. గురజాల నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు వెయ్యి మందికి పైగా ఆటో డ్రైవర్లకు నగదు జమవుతుందని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. ఈ సందర్భంగా మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు, రవాణా శాఖ అధికారి బయ్యవరపు శ్రీనివాసరావు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, కొమ్మినేని రామచంద్రరావు, వడ్డవల్లి సాంబశివరావు, జొన్నలగడ్డ శ్రీను, యరగాని వెంకట్ (లడ్డు), కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, దియ్యా రామకృష్ణ, గండికోట వెంకటేశ్వర్లు, మేకల సాంబశివరావు, హనుమంతరావు, వున్నం సురేష్, పణితి రవి, సయ్యద్ అమీర్‌అలి, మందా డేవిడ్, కొంకా రాధ, ఈదర అనురాధ, లంజేపల్లి కొండలు, అనబోతుల యలమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడిపంటలతో వర్ధిల్లాలి : యరపతినేని నిఖిల్

దాచేపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతం పాడిపంటలతో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు యరపతినేని నిఖిల్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం దాచేపల్లి సహకార సంఘం అధ్యక్షుడు తంగెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యాన పది రోజులుగా జరుగుతున్న దుర్గాదేవి ముగింపు ఉత్సవాలకు యరపతినేని నిఖిల్ ముఖ్యఅతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నర్రా పుల్లయ్య, మునగా నిమ్మయ్య, బొమ్మిరెడ్డి నారాయణ, భాస్కరరావు, సొసైటీ నారాయణ, మాజీ ఎంపీటీసీ వలి, ఉప్పల గిరి, షేక్ అహ్మద్, రుద్రాల అచ్చారావు, తోట వెంకటేశ్వర్లు, ఐనాల శ్రీరాములు, సాధినేని కోటేశ్వరరావు, నారాయణ, కూరాకుల నాగేశ్వరరావు, కల్లూరి రాఘవ, కోట సాయన్న పాల్గొన్నారు.



దుర్గాదేవి విగ్రహం వద్ద ప్రత్యేక పూజల్లో యరపతినేని నిఖిల్

బెల్లంకొండ అనసూయమ్మకు నివాళి

మాజీ సహకార సంఘం సభ్యురాలు, టీడీపీ నాయకురాలు బెల్లంకొండ అనసూయమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి యరపతినేని నిఖిల్‌బాబు హాజరయ్యారు. అనసూయమ్మ కుమారుడు బెల్లంకొండ భారతి బద్రి నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఉన్నారు.

ఉత్కంఠ భరితంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

● రెండు పళ్ల విభాగంలో మేళ్లచెరువు ఎడ్ల జతకు ప్రథమ స్థానం

క్రోసూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలం బయ్యవరంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి పశుబల ప్రదర్శన పోటీలు ఉత్కంఠ భరితంగా జరుగుతున్నాయి. రెండో రోజు జరిగిన రెండు పళ్ళ విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మేళ్లచెరువు ఎడ్ల జతకు ప్రథమ స్థానం లభించింది. నిర్ణీత గడువులో ఈ ఎడ్ల జత 3351.4 అడుగులు బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం అయోధ్య నగర్‌కు చెందిన ఎడ్లజత ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన ఎడ్ల జత నిలిచింది. పోటీలు మరో మూడు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. నాలుగు పళ్ళ విభాగం, న్యూ క్యాటగిరి విభాగంలో పోటీలు జరగాల్సి ఉంది.




కేసీపీ సిమెంట్ పరిశ్రమలో మొక్కలు నాటుతున్న ఏపీపీసీబీ చైర్మన్ పి.కృష్ణయ్య, పాల్గొన్న ప్రాంతీయ పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం

సిమెంట్ పరిశ్రమల్లో కాలుష్యాన్ని నియంత్రించాలి

● ఏపీపీసీబీ చైర్మన్ పి.కృష్ణయ్య

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ పరిశ్రమల్లో వస్తున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఆయా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు(ఏపీపీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య కోరారు. పల్నాడు జిల్లా, మాచర్లలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కేసీపీ ఆడిటోరియంలో సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ రంగంలో సామాజిక బాధ్యతను విస్మరించవద్దని సూచించారు. ప్రాంతీయ పర్యావరణ ఇంజనీరు మాట్లాడుతూ దుమ్ము, వాయు కాలుష్యాల్ని నిరంతరం పర్యవేక్షించి, నమోదవుతున్న శాతాలను గమనించాలని సూచించారు. అనంతరం సిమెంట్ పరిశ్రమ అవరణలో పి.కృష్ణయ్య మొక్కలు నాటారు. ఈ సమావేశంలో కేసీపీ, చెట్టినాడ్, పరాశక్తి, భవ్య, శ్రీచక్ర, ఆంధ్ర, శ్రీసిమెంట్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరావతి సందర్శించిన తైవాన్ బుద్ధిస్టులు



మహాచైత్యం సందర్శించిన తైవాన్ బౌద్ధులు

అమరావతి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ బౌద్ధారామంగా పేరుగాంచిన అమరావతిని తైవాన్ దేశానికి చెందిన బుద్ధిస్టుల బృందం సందర్శించింది. శనివారం సాయంత్రం ధ్యానబుద్ధ ప్రాజెక్టును, మహాచైత్యం సందర్శించారు. 11రోజుల పాటు దక్షిణ భారత దేశంలోని బుద్ధిస్టు ప్రదేశాలను సందర్శించేందుకు వీరు వచ్చారు. వీరి వెంట డిల్లీకి చెందిన గైడ్ పాల్గొని వారికి బౌద్ధక్షేత్రాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఘనంగా పల్నాడు విద్యుత్ భవన్ తొలి వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ వినియోగదారుల సౌకర్యార్థం జిల్లాల విభజనలో భాగంగా ఏర్పాటు చేసిన సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం ఒక వార్షికోత్సవం సందర్భంగా పల్నాడు విద్యుత్ భవన్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూపరింటెండింగ్ ఇంజనీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత సంవత్సరంలో పల్నాడు జిల్లా విద్యుత్‌శాఖ పనితీరు అభినందనీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్లు, అకౌంట్స్ అధికారులు, టెక్నికల్, విద్యుత్ భవన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రేషన్‌షాపులో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ సురేష్

రేషన్‌షాపుల్లో తనిఖీలు

వినుకొండటౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు రేషన్ షాపుల్లో తహసీల్దార్ సురేష్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన షాపుల్లోని స్టాక్ వివరాలు, ఈపాస్ మిషన్‌లోని స్టార్ వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు సమయపాలన పాటించడం లేదని, బియ్యంకు బదులుగా డబ్బులు ఇస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా రేషన్‌బియ్యానికి బదులు నగదును ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డీటీ మురళి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బొల్లా ఆరోపణలకు ఎరువుల దుకాణాదారుల ఖండన

వినుకొండటౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఎరువుల వ్యాపారులపై బ్రహ్మనాయుడు చేస్తున్న నిరాధారణమైన ఆరోపణలను ఎరువుల దుకాణాదారులు తీవ్రంగా ఖండించారు. స్థానిక సంఘం మందిరంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యూరియా, డీఏపీ అధిక ధరలకు విక్రయిస్తున్నారని బొల్లా బ్రహ్మనాయుడు చేసిన ఆరోపణలు ముమ్మాటికి అవాస్తవం అని సంఘం సభ్యులు అన్నారు. ఎరువులు కావాలంటే పురుగు మందులు తీసుకోవాలని వ్యాపారులు బలవంతపెడుతున్నట్టు బొల్లా చేసే విమర్శలు అబద్ధాలన్నారు. ఎరువులు, పురుగుమందుల విక్రయాల్లో బ్రహ్మ నాయుడు చేసిన ఆరోపణలపై నిరూపించాలని సవాల్ విసిరారు.

రైతులు పంట నమోదు చేసుకోవాలి

వినుకొండటౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు తమ పంటను నమోదు చేయించుకోవాల్సిందిగా ఏవో జి వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బందికి అర్జీ అందజేసి వీఆర్వో ద్వారా కౌలు రైతు కార్డు పొంది సంబంధిత సర్వే నంబర్లలో వేసిన పంటను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాల్సిందిగా ఆమె తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ఈపూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్నిగుండాల పొలాలలో వ్యవసాయం కోసం ఏర్పాటుచేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి వైరును తీసుకువెళ్లారు. గ్రామానికి చెందిన శివాల వెంకటేశ్వర్లు, ఓబుల్‌శెట్టి చెన్నారావు పొలాలలోని విద్యుత్తు మోటార్ల కోసం కాలువ కట్ట పక్కన నిర్మించుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ని గుర్తు తెలియని దుండగులు తీసుకెళ్లారు. వారం రోజులు భద్రపాలెం, బొమ్మరాజుపల్లి గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీ జరిగింది.

వజ్రాల కృష్ణారెడ్డికి నివాళి

వినుకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లి మాజీ సర్పంచ్, టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వజ్రాల కృష్ణారెడ్డి శుక్రవారం మరణించారు. శనివారం విఠంరాజుపల్లిలోని కృష్ణారెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ తరఫున కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం కృష్ణారెడ్డి అంతిమయాత్రలో జీవీ పాల్గొన్నారు. జీవీతో పాటు డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

నేడు అమృత మంజరి ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ

వినుకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మను జ్యోతి ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం నరసరావుపేట రోడ్డులోని కే.జి.ఎల్ కళ్యాణ మండపంలో జరగబోవు అమృత మంజరి (అంకురం-2) ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణను జయప్రదం చేయమని ఆశ్రమం నిర్వాహకులు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మొదటిసారి దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఆత్మీయ గ్రంథావిష్కరణకు అనేకమంది ఆత్మీయ నాయకులు, ఆధ్యాత్మిక కవులు, సాహితీవేత్తలు, ముఖ్య ప్రముఖులు, వ్యాపారవేత్తలు పాల్గొననున్నారని, ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు.

కష్టజీవులు, సేవాపరులు ఆటో డ్రైవర్లు

● ఆటో డ్రైవర్ల సేవలో ప్రారంభోత్సవంలో కలెక్టర్ కృతికా శుక్లా



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, తదితరులు


ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు కష్టజీవులని కలెక్టర్ కృతిక శుక్లా అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులను కష్టంలో ఉన్న అభాగ్యులను అవసరమైతే ఉచితంగా గమ్యాన్ని చేర్చే సేవాపరులన్నారు. కరోనా సమయంలో ఆటో డ్రైవర్లు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. అలాంటి కష్టజీవుల కోసం ప్రభుత్వం భోజన ఖర్చులు తగ్గించేందుకు అన్నా క్యాంటీన్ పథకంలో రూ.5కే భోజనం అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందించిన రూ 15 వేలు వాహనాల రిపేర్లకు, బీమా సేవలకు ఉపయోగపడుతుందన్నారు. డ్రైవర్లు అందరూ తమ పిల్లలను బాగా చదివించుకొని ఉన్నత స్థాయికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో మొత్తం 8884 మంది ఆటో డ్రైవర్లు బ్యాంకు ఖాతాలలో ఒక్కొక్కరికి రూ 15వేలు వంతున, నరసరావుపేట నియోజకవర్గానికి సంబంధించి 1577మంది డ్రైవర్లుకు రూ 2,36,55,000 చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో 6868 మంది ఆటో డ్రైవర్లుకు రూ 10,30,20,000, 1123 త్రీవీలర్ క్యాబ్ డ్రైవర్లుకు రూ 32,25,000, నలుగురు లగ్జరీ టూరిస్టు క్యాబ్ డ్రైవర్లుకు రూ.60,000, లగ్జరీ క్యాబ్ డ్రైవర్లుకు ఇద్దరికి రూ.30 వేలు, సెమీ లగ్జరీ క్యాబ్ డ్రైవర్‌కు రూ 15 వేలు, ఇతరులకు ఒకరికి రూ 15 వేలు మొత్తం రూ 13,32,60,000 అందించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు వ్యక్తిగత ఆరోగ్యం మీద శ్రద్ధ వహించాలన్నారు. డ్రైవర్ల ఆరోగ్యం మీద వారి కుటుంబాలు ఆధారపడి ఉంటాయన్నారు. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకంలో కేవలం నరసరావుపేటలో 15 వందల మందికి పైగా డ్రైవర్లుకు రూ 2.36 కోట్లు నగదు జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఆర్డీవో మధులత, ఆర్టీవో సంజీవ్‌కుమార్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు, తహసీల్దార్ కే వేణుగోపాలరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల భారీ ర్యాలీ

ఆటో డ్రైవర్ల సేవ లో పథకం ప్రారంభం సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట భారీ ర్యాలీ జరిగింది. ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైంది. మల్లమ్మసెంటర్, శివుడు బొమ్మసెంటర్, మున్సిపల్ కార్యాలయం, స్టేషన్ రోడ్డు మీదగా భువన చంద్రటౌన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు పట్టణంలో ట్రాక్టర్ నడుపుతూ, ఆటో డ్రైవ్ చేసి సందడి చేశారు. శివుడు బొమ్మవద్ద మొక్కి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు అన్నారు.


చిలకలూరిపేటలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


చిలకలూరిపేటలో ఆటో డ్రైవర్ల భారీ ర్యాలీ..

1,189మంది ఆటోడ్రైవర్లకు రూ.1.69కోట్ల లబ్ధి

● పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి ● 300 ఆటోలతో భారీ ర్యాలీ

చిలకలూరిపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గంలో 1,189 మందిని ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి ఎంపికచేసి, ఒక్కొకరికి రూ.15వేల చొప్పున రూ.1.69 కోట్ల మేరకు వారి ఖాతాలలో నేరుగా జమచేసినట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం తెలిపారు. పట్టణంలో ఆటో డ్రైవర్ల సమక్షంలో ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని ఆయన ప్రారంభించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం 300 ఆటోలతో డ్రైవర్లు నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రత్తిపాటి స్వయంగా ఆటోనడిపి ఆటో డ్రైవర్లను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.30 వేలకు పెంచిన గ్రీన్ ట్యాక్స్ ను కూటమి ప్రభుత్వం రూ.3 వేలకు తగ్గించిందని చెప్పారు. పల్నాడు జిల్లాలో 8,884 మంది ఆటో డ్రైవర్లు, యజమానులకు రూ.13.32 కోట్ల మేర ప్రభుత్వ సాయం లభిస్తుందని వివరించారు. ప్రతి ఆటోడ్రైవర్ తమకు జరిగిన మేలుతో పాటు, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లకు టిడ్కో ఇళ్ల కేటాయించే అంశాన్ని పరిశీలిస్తానని, అవసరమైతే ప్రభుత్వంతో మాట్లాడి వారికి న్యాయం చేస్తానని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మెన్ షేక్ రఫాని, యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మునిసిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు, ఆర్డీవో ఎన్ గోపాల్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి

యడ్లపాడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం కృషిచేస్తున్నదని టీడీపీ నాయకులు అన్నారు. చిలకలూరిపేటలో శనివారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమానికి మండలం నుంచి తరలివెళుతున్న ఆటోలకు నీటి సంఘం అధ్యక్షులు పోపూరి రాఘవయ్య, సీనియర్ టీడీపీ నాయకులు పోపూరి రత్తయ్యలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు. మేనిఫెస్టోలో, సూపర్ సిక్స్ పథకాలలో లేకున్నా ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.15వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నదన్నారు. అభివృది, సంక్షేమం అంటే టీడీపీ అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

శ్రీశైలం బోర్డు సభ్యుడిగా..

బోడేపూడి నియామకం అభినందనీయం

● డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యే కన్నా


సుబ్బారావును అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

గుంటూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఆలయ బోర్డు సభ్యుడిగా గుంటూరుకు చెందిన బోడేపూడి వెంకట సుబ్బారావు నియమితులు కావడం అభినందనీయమని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అభినందించారు. శనివారం గుంటూరులోని తన కార్యాలయానికి వచ్చిన రఘురామ కృష్ణంరాజు, కన్నా లక్ష్మీనారాయణకు సుబ్బారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి సుబ్బారావుకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీశైలం శివయ్య భక్తులకు సేవలు అందించి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు సంపాదించాలని పేర్కొన్నారు. మారుతి సుబ్రమణ్యం, వాసిరెడ్డి రవిచంద్ర, గోనుగుంట్ల హనుమంతరావు, గోరంట్ల సాంబశివరావు, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, చలం, వజ్జా వీరాంజనేయులు, గంగినేని రామారావు, గంగినేని గురుస్వామి తదితరులు అభినందనలు తెలిపారు.

శ్రీకరుణ ఆశ్రమానికి కారు అందజేత


కారును అందజేస్తున్న రిటైర్డ్ ఎంఈవో కమలాకర్, ఆకాశ్ తదితరులు


నరసరావుపేట టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కురుచేడు మండలం పడమర వీరాయపాలెంలోని శ్రీ కరుణ ఆశ్రమానికి దాతలు ఉచితంగా పాత కారు అందజేశారని ఆశ్రమం డైరెక్టర్ కాశయ్య తెలిపారు. నరసరావుపేటలో గుంటూరుకు చెందిన రిటైర్డు ఎంఈవో కమలాకర్, ఆయన కుమారుడు అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ ఆకాశ్‌లు తమ పాతకారు మారుతి వేగనర్‌ను ఉచితంగా శనివారం అందజేశారని చెప్పారు.

ఆలయ పునఃనిర్మాణానికి రూ.3 లక్షల విరాళం


విరాళం అందజేసిన దాతలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటబజారు పులుపులవారి వీధిలో గల శ్రీవీరాంజనేయ సహిత శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నరసరావుపేట పట్టణానికి చెందిన హేమ జ్యూవెలరీస్ కొత్తమాసు సాంబశివరావు జ్ఞాపకార్థం ధర్మపత్ని పార్వతి, కుమారుడు మహేష్, ధర్మపత్ని ఆదిలక్ష్మీ ఆలయంలో 11వ స్తంభం నిర్మాణం కొరకు రూ 3,01,116 విరాళంను ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో వనమా సాంబశివరావు, వనమా కృష్ణ, గజవల్లి మురళి, కొప్పురావూరి నాగేశ్వరరావు, బత్తుల విష్ణు, రాచూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ.. ఒకరి మృతి


గోపిరెడ్డి (ఫైల్ ఫోటో)

రొంపిచర్ల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరి చెట్టుపాలెం నుండి మాచవరం వెళ్లే రహదారిలో శుక్రవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. శనివారం పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచవరం గ్రామానికి చెందిన వెన్న గోపిరెడ్డి(21) ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళుతున్నాడు. మాచవరం నుండి నకరికల్లు మండలం కుంకలగుంట వెళుతున్న హుస్సేన్‌కి చెందిన ద్విచక్రవాహనం, గోపిరెడ్డి ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. దీంతో గోపిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. హుస్సేన్‌కు గాయాలు అవ్వడంతో నరసరావుపేటలోని వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వెన్న తాతిరెడ్డి, పుల్లమ్మ దంపతులకు ఒకే ఒక్క కుమారుడు గోపిరెడ్డి. పుల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు..

ఘనంగా ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం

నరసరావుపేట లీగల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ఎస్ఆర్‌కేటీలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులకు కూడా బతికే హక్కు ఉందన్నారు. వాటిని కాపాడుకోవడం సమాజ బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ జంతు ప్రేమికులుగా మారినప్పుడు పర్యావరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. జంతువులను ప్రేమగా చూడాలన్నారు. సంస్థ సలహాదారు న్యాయవాది దాసరి చిట్టిబాబు మాట్లాడుతూ జీవవైవిధ్యం కాపాడుతుంది జంతువులే అన్నారు. జంతువులను చంపే హక్కు మనకు లేదన్నారు. పాఠశాల గ్రంథాలయానికి జన విజ్ఞాన వేదిక ప్రచురించిన 50 రకాల సాహిత్య గ్రంథాలను బహూకరించారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి సిబ్బంది

ఉచిత కంటి వైద్య శిబిరం

నరసరావుపేట టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల సంఘం భవనంలో శనివారం మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డు ఉన్నవారికి ఉచితంగా కంటి అన్నిరకాల శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని నిర్వాహకులు చెప్పారు. శస్త్రచికిత్సలు చేయించుకోనేవారికి ఉచిత రవాణా సదుపాయం ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి సీసీ ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాదు, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం, పూజల హనుమంతరావు, ఆసుపత్రి క్యాంప్ కోఆర్డినేటర్ టీపీ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆటోడ్రైవర్ల ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, జనసేన నాయకుడు కొణిజేటి నాగశ్రీను, నాయకులు

ఆటో డ్రైవర్లకు ఒకేరోజు రూ.436 కోట్లు

● వినుకొండ నియోజకవర్గంలోనే 1161మందికి రూ.1.74కోట్ల లబ్ధి

● ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించిన చీఫ్ విప్ జీవీ

వినుకొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2,90,669మంది ఆటో డ్రైవర్లకు ఒకేరోజు రూ.436కోట్లు సాయం అందించడం కొత్త చరిత్ర అని వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండలో ఆటోడ్రైవర్ల సేవలో పథకం శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. నరసరావుపేట రోడ్డులోని ఎన్నెస్పీ కాల్వ కట్ట, బస్టాండ్ సెంటర్, స్తూపం సెంటర్ మీదుగా మున్సిపల్ ఆఫీస్ వరకు ఆటోల భారీ ర్యాలీతో ఈ కార్యక్రమానికి శ్రీకార చుట్టారు. చీఫ్‌విప్ జీవీ ఖాకీ చొక్కా ధరించి స్వయంగా ఆటో నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలోనే 1161 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.1.74 కోట్లు జమ చేశామన్నారు. ఉచితబస్సు ప్రయాణం వల్ల వారికి జరిగే నష్టం భర్తీకే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఒక్కొక్కరి రూ.15వేలు లబ్ది చేకూరుస్తుంటే గత వైసీపీ పాలనలో కేవలం రూ.10వేలు ఇచ్చి డీజిల్, పెట్రోల్ ధరలు అమాంతం పెంచి జేబులకు చిల్లుపెట్టారని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన వెంటనే చంద్రబాబు ఆ పన్నులను రద్దు చేశారన్నారు. గుంతల రోడ్లు బాగు చేసి వారిని ప్రమాదాలు, మరమ్మతుల నుంచి కాపాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, జనసేన నాయకులు నాగ శ్రీనురాయల్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేని వాళ్లకు లైసెన్స్ ఇప్పిస్తాం

ప్రభుత్వ సాయం అందుకోవడానికి డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరైన నేపథ్యంలో లేనివారికి అది వెంటనే ఇప్పించే ఏర్పాట్లు చేస్తామని చీఫ్‌విప్ జీవీ అన్నారు. నియోజకవర్గంలో డ్రైవింగ్ లైసెన్స్ లేనివాళ్లు 2-3 వేలమంది ఉన్నారని, వారందరికీ త్వరలో లైసెన్స్ వచ్చేలా చూస్తామన్నారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా వినుకొండ నియోజకవర్గంలో 3-4వేలమంది డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడానికి సిద్ధంగా ఉన్నామని ఎల్ఎల్ఆర్‌కు రూ.460 డ్రైవర్లు చెల్లిస్తే మిగిలిన రూ.1260 శివశక్తి ఫౌండేషన్ చెల్లిస్తుందని హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంతో పెట్టుబడులు, ఉద్యోగాలు

సంక్షేమం, అభివృద్ధికి ఢోకా లేకుండా చూస్తున్న కూటమి పాలనలో ఆర్థిక వ్యవస్థ కూడా గాడినపడిందన్నారు. ఇప్పటికే రూ.10లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలతో 9లక్షల మందికి ఉద్యోగాలు వస్తుండడమే అందుకు నిదర్శనమన్నారు. రికార్డు సమయంలో మెగా డీఎస్సీతో 16,347ఉపాధ్యాయ పోస్టుల నియామకాలు చేసినందుకు ప్రజలంతా హర్షం వ్యక్తంచేస్తున్నారన్నారు.

ఆటోడ్రైవర్లకు చేయూతగా రూ.15వేల ఆర్థికసాయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, రూ.15వేలు ఆర్థిక సాయం అందించడం ఆటోడ్రైవర్లకు చేయూతగా ఉంటుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శనివారం అన్నారు. ఇచ్చినమాట ప్రకారం ఆటో, మ్యాక్సీ క్యాబ్, మోటర్ క్యాబ్ డ్రైవర్లకు రాష్ట్ర వ్యాప్తంగా 2, 90, 669 మంది డ్రైవర్ల ఖాతాలలో రూ.15వేల వంతున రూ.436కోట్లు ప్రభుత్వం జమచేసిందన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు కూటమి ప్రభుత్వం అమలు చేసిందని, వాటితోపాటు కొత్త పథకాలు కూడా అమలు చేస్తుందన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని వీడిన పరిశ్రమలు తిరిగి రాష్ట్రానికి రావడం ఎంతో ఆనందదాయకం అన్నారు. రాష్ట్రంలో 20లక్షల మందికి పైగా కుటుంబాలకు ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమం ద్వారా లబ్ది చేకూరనుందన్నారు. గత ప్రభుత్వం ఇదే పథకాన్ని ఇచ్చినా వడ్డీతో సహా తిరిగి గ్రీన్‌టాక్స్ పేరిట వసూలు చేసిందన్నారు. ఆటో సోదరులు కూటమి సర్కారును విశ్వసించాలని కోరారు. జీఎస్టీ 2.0 విప్లవంతో పెద్దఎత్తున వాహన కొనుగోలు జరిగాయని, ఈ స్థాయి తోడ్పాటు అందిస్తున్న ప్రధాని మోడీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలిపారు.

బొప్పూడిలో నేడు మొక్కలు నాటే కార్యక్రమం

చిలకలూరిపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీచెన్నకేశవస్వామి, శ్రీమల్లేశ్వర స్వామి వార్ల భూమి య.1.20 సెంట్లలో నక్షత్రాలు, రాశుల వారీగా భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుడుతున్నారు. ఇందుకోసం చిలకలూరిపేట శ్రీసత్యసాయి సేవా సంస్థ, దేవదాయ, ధర్మాదాయ శాఖ సహకారంతో పెద్ద సంఖ్యలో మొక్కలు సేకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, అటవీశాఖ, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఫ్లయింగ్ టెన్నిస్, స్కూల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ సంఘాలకు ఎన్నిక

చిలకలూరిపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫ్లయింగ్ టెన్నిస్, స్కూల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ సంఘాల ఎన్నికలు స్థానిక యార్కర్ క్లబ్‌లో శనివారం సభ్యుల సాధారణ సమావేశంలో నిర్వహించారు. ఫ్లయింగ్ టెన్నిస్ సంఘం అధ్యకులుగా ఎల్ మహేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఈ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బొంతా కృపారావు, సహాయ కార్యదర్శిగా జి వాసవి, కోశాధికారిగా సీహెచ్ గురునాథ్ ఎన్నికయ్యారు. స్కూల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అధ్యక్షులుగా లంకా మహేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ గురునాథ్, కోశాధికారిగా బొంతా కృపారావులను ఎన్నుకున్నారు. వీరు తమ పదవులలో మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారు.

ఎంపీపీ పాఠశాలకు ప్రింటర్ వితరణ

యడ్లపాడు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగారావుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి, చార్టెర్డ్ అకౌంటెంట్ నంబూరు నరసింహారావు రూ.24వేల విలువైన ప్రింటర్, ఫింగర్ అథంటికేషన్ డివైజ్‌ను అందజేశారు. దాత నరసింహారావుతో పాటు ఆయనతో ఇప్పించిన గ్రామపెద్దలు నంబూరి శివరామకృష్ణ, తోకల సత్యన్నారాయణలను హెచ్ఎం నజీర్ అహ్మద్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.


లింగారావుపాలెం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం నజీర్‌కు ప్రింటర్‌ను అందజేస్తున్న చార్టర్డ్ అకౌంటెంట్ నరసింహారావు